# షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**• వెల్జర్ల గ్రామ లబ్ధిదారులకు ప్రభుత్వ కానుక**



**తొలి అక్షరం/షాద్ నగర్, మే 11:** పేదింటి ఆడపిల్లల వివాహానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం ఆర్థిక భరోసాగా నిలుస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. వెల్జర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు స్థానిక సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో చెక్కులు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో పెద్ద ఊరటనిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్వో నాగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయి కల్ శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ నేత వావిలాల సుజివన్, గ్రామ జిపివో విష్ణు, కాంగ్రెస్ సీనియర్ నేతలు జాంగారి జంగయ్య, కటికెల తిరుపతి యాదవ్, జాంగారి రవి, అనిమి గణేష్ గౌడ్, కావాలి నర్సింహులు, తుప్పారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇనగాలను కలిసిన కార్పొరేషన్ ఛైర్మన్లు



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కూడా) ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని పలువురు నూతన కార్పొరేషన్ ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ తెలుగు అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ వెంకట నారాయణ, తెలంగాణ మేర సహకార సంస్థ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమితులైన సంగ వెంకటరాజం హనుమకొండలోని వెంకట్రామ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ రెడ్డి వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తూ, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా పనిచేయాలని ఆయన సూచించారు. పదవులు పొందిన నేతలు వెంకట్రామ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జీవో నెంబర్ 17ను వెంటనే రద్దు చేయాలి

**• హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా**

**• మద్దతుగా ధర్నాలో పాల్గొన్న దాస్యం వినయ్ భాస్కర్**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ మంద శ్యామ్ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా లో మద్దతుగా పాల్గొన్న మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్, ఈ సందర్భంగా మాట్లాడుతూ...కెసిఆర్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో సమన్వయ న్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రమే అవకాశం కల్పిస్తూ చేవెళ్ల కామారెడ్డి లో చేసిన డిక్లరేషన్ను తుంగలో తొక్కారన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో దాదాపు పదివేల మంది కాంట్రాక్టర్లకు ఉపాధి కల్పించింది కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లను అడ్డ కూలీలుగా మార్చేస్తుందని, జీవో నెంబర్ 17 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్లకు అవకాశాలు తగ్గుతున్నాయి కాబట్టి జీవో నెంబర్ 17న వెంటనే రద్దు చేయాలి. జీవో నెంబర్ 17ను రద్దు చేయకపోతే దశలవారీగా మా పోరాటం ఉంటుందని వారు అన్నారు

# 64మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా అందజేత**





**తొలి అక్షరం/షాద్ నగర్, మే 11:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ ఛైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగయ్య, అధికారులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు

**• జె.బి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రధానం**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హన్మకొండ పబ్లిక్ గార్డెన్, పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ కళా ప్రాంగణం లో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జె.బి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ, వరంగల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ మూర్తి దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026 ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళా ప్రాంగణంలో సాయంత్రం మొదలైన కార్యక్రమం అర్ధరాత్రి వరకు అంగరంగ వైభవంగా కూచిపూడి నృత్యాలతో, ఆటపాటలతో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ అమ్మ త్యాగాలకు, నిద్రలేని రాత్రులకు మాటల్లో చెప్పలేని ప్రేమకు కూడా ధన్యవాదం చెప్పే రోజు కావాలి. కాబట్టి మాతృ మూర్తుల దినోత్సవం అంటే ఒక్కరోజు అమ్మను ప్రేమించడం కాదు. ప్రతిరోజూ ప్రేమించే ఒక ప్రత్యేక గుర్తు మాత్రమే అని అమ్మ గొప్పతనాన్ని చాటి చెప్పారు. కళాకారుల వృత్తికి అంకితభావం, సృజనాత్మకత, క్రమశిక్షణ అవసరం అన్నారు. నిజమైన కళాకారుడు కేవలం ప్రశంసల కోసం కాకుండా, కళ కోసం, భగవంతుని కోసం తన ప్రదర్శనను ఇస్తాడు. కళాకారుడు వ్యక్తిగత చైతన్యాన్ని కోల్పోయి విశ్వ చైతన్యంలో కలిసిపోవడం వారి పరమావధి. స్టేజ్ కళాకారులు సమాజానికి అద్దం పడతారు. వారి ప్రతిభ, నిబద్ధత, కళ పట్ల వారికున్న అంకితభావం అభినందనీయం. వారిని ప్రోత్సహించడం, వారి కళను గౌరవించడం మన బాధ్యత అని కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం ను మెమెంటో తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జె.బి కల్చరర్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు జడల శివ, జడల హరిత, డాక్టర్. హరినాధ రావు, బీటవరం శ్రీధర స్వామి, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, కాజీపేట తిరుమలయ్య, జూలుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, కూరపాటి శ్రీధర్ రాజు, ఆకుల సదానందం, జనగాం రాము, కీర్తి, జూలూరి శ్రీనివాస్, కరిమిల్ల సంపత్ రావు, లక్ష్మా రెడ్డి తదితరులు మరియు అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ప్రారంభం






**తొలి అక్షరం/షాద్ నగర్, మే 11:** తెలంగాణ ప్రభుత్వం 'ప్రజా పాలన - ప్రగతి పాలన' కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక కౌన్సిలర్ నరేష్, కాంగ్రెస్ నాయకుడు ఖదీర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈరోజు కళాశాల అడ్మిషన్ల బ్రోచర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ కమల్, కౌన్సిలర్ నరేష్, ఖదీర్ , వైస్ ప్రిన్సిపల్ పాలాది శ్రీనివాసులు, అధ్యాపకులు విడుదల చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, "కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మంచి వెంటిలేషన్‌తో విశాల తరగతి గదులు ఉన్నాయి. ఈ సంవత్సరం నుంచి ఉద్యోగ కల్పన కోర్సులు – బీ.కామ్ రిటైల్ ఆపరేషన్స్, బీ.ఎస్సీ ఫార్మాస్యూటికల్ సైన్స్‌లను ప్రవేశపెట్టాం. ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీతో పాటు సర్టిఫికెట్, ఉద్యోగాలు పొందుతారు" అని తెలిపారు. కౌన్సిలర్ నరేష్, "షాద్ నగర్ నియోజకవర్గంలోని ఈ ప్రభుత్వ కళాశాల 'ఎ న్యాక్ బి ప్లస్' గ్రేడ్ పొందింది. ఇది మన గర్వకారణం. ఇంటర్ పాసైన విద్యార్థులు అత్యున్నత సౌకర్యాలతో ఇక్కడ చేరి సద్వినియోగం చేసుకోవాలి" అన్నారు. కాంగ్రెస్ నాయకుడు ఖదీర్, "ఉద్యోగ ఆధారిత కోర్సులను ప్రాంతీయ విద్యార్థులు ఉపయోగించుకుని ఉద్యోగ భద్రత పొందాలి" అని సూచించారు. ఈ సందర్భంగా నరేష్, ఖదీర్ రిపేర్ చేయబడిన బోరుబావిని పునఃప్రారంభించారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

**- అపరిచితులకు వ్యక్తిగత వివరాలు వెల్లడించొద్దు**

**- ఉప్పల్ ఏసీపీ వెంకటరెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి.సైదులు),మే11:** సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పంథాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని వీటిపై అవగాహనే శ్రీరామరక్ష అని ఉప్పల్ ఏసీపీ వై. వెంకటరెడ్డి అన్నారు. పద్మావతి కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కమ్యూనిటీ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు.

**డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు:**

ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ కాల్స్ చేసి భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, చట్టరీత్యా డిజిటల్ అరెస్ట్ అనే పదం లేదని ఎటువంటి ఫోన్ కాల్స్ వస్తే భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

**బ్యాంకు వివరాల గోప్యత:**

బ్యాంక్ అధికారులు ఎప్పుడూ ఫోన్లో మీ పిన్ నంబర్లు లేదా ఓటీపీలు అడగరని గుర్తుంచుకోవాలన్నారు. లోన్ యాప్‌ల ఉచ్చులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

**లింకుల పట్ల జాగ్రత్త:**

లాటరీ తగిలిందనో తక్కువ ధరకే వస్తువులు వస్తాయనో వచ్చే మెసేజ్‌లను నమ్మి వాటిలో ఉండే లింకులను క్లిక్ చేస్తే మీ డేటా మొత్తం హ్యాకర్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.





**గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత:**

ఒకవేళ పొరపాటున సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా మొదటి గంటలోనే గోల్డెన్ అర్ (గోల్డెన్ అవర్) 1930 కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. తద్వారా పోయిన డబ్బును రికవర్ చేసే అవకాశం ఉంటుందని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి కాలనీలో నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్హెచ్ఓ రామలింగారెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, కాలనీవాసులు సమన్వయంతో నేర రహిత సమాజానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐ చిరంజీవి, స్థానిక నేతలు మరపెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

